క్లుప్తంగా

పోలీస్ స్టేషన్‌లో పెదరాయుళ్లు



ఖద్దరు పంచలతో ఆత్మకూరు పోలీస్ ఉన్నతాధికారులు , పోలీస్‌సిబ్బంది

ఆత్మకూరురూరల్: 'పోలీస్ స్టేషన్‌లో పెదరాయుళ్లు' అనగానే ఇదేదో సివిల్ పంచాయతీలు చేసే పోలీసులపై కథనం అనుకుంటే తప్పులో కాలేసినట్లే... ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో విజయదశమి పర్వదిన శుభవేళ సోమవారం అధికారులు ఖద్దరు దుస్తుల్లో పెదరాయుడు గెటప్‌లో కనిపించి సందడి చేశారు. అధికారులు, సిబ్బంది కూడా ధవళ వస్త్రాలతో, ప్రసన్న వదనాలతో కనిపించడం విశేషం. ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో జరిగిన పండగ పూజా కార్యక్రమానికి డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ నాగభూషణం, ఎస్‌ఐలు కృష్ణమూర్తి, నారాయణ రెడ్డి, ఇతర పోలీసు సిబ్బంది తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా పంచెకట్టుతో హాజరై చూపరులకు ఆహ్లాదాన్ని కలిగించారు. కాగా ప్రశాంత వాతావరణంలో స్టేషన్‌లో జరిగిన ఈ పండుగ వాతావరణ ఫలితమో ఏమో కాని రోజంతా ఒక్క ఫిర్యాదు కానీ, అభ్యర్థన కానీ రాకపోవడం విశేషమని సీఐ నాగభూషణం చెప్పడం కొసమెరుపు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని శవం

నందికొట్కూరు: గుర్తు తెలియని వ్యక్తి బస్టాండ్ సమీపంలో మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు పట్టణంలో భిక్షాటన చేసే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి వయస్సు సుమారు 65 ఏళ్లలోపు ఉంటుంది. అనాథ శవానికి పోలీసుల ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఆనవాలు గుర్తించిన వారు పట్టణ పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించాలని కోరారు.

గుడిసె దగ్ధం



దగ్ధమయిన గుడిసె

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంటలోని ఖాదర్‌హోటల్ సమీపంలో నివసిస్తున్న బీబీ గుడిసె మంగళవారం షార్ట్ సూర్క్యూట్ కారణంగా దగ్ధమయ్యింది. ఇంట్లో ఉన్న గృహోపకరణాలు కాలిపోయాయి. సుమారు రూ.70 వేల విలువగల వస్తువులు బూడిదపాలైనట్లు బీబీ తెలిపారు. ఫైర్‌సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు.

మహానంది దేవస్థానం ఉద్యోగి మృతి



శివకుమార్(ఫైల్)

మహానంది: మహానంది దేవస్థానంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న డీపీ శివకుమార్(31) మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఇంటి వద్ద ఉండగా గుండెనొప్పి అంటూ చెప్పారని, చికిత్స నిమిత్తం నంద్యాల ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే ప్రాణాలు విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతి చెందిన శివకుమార్‌కు భార్య శిరీష, ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ట్రస్ట్‌బోర్డు మెంబర్ గంగిశెట్టి మల్లికార్జున, సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు, ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, హరినాథ్, అర్చకులు రాఘవశర్మ తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం దేవస్థానం ఆధ్వర్యంలో రూ. 15వేలు నగదు అందించారు.

కబడ్డీ విజేత శ్రీనగరం

మహానంది: తిమ్మాపురంలోని శ్రీ అంకాళ పరమేశ్వరీదేవి ఆలయం వద్ద నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో మహానంది మండలం శ్రీనగరం జట్టు ప్రథమస్థానంలో నిలిచినట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. రెండో స్థానంలో అయ్యకొండ జట్టు, మూడోస్థానంలో తిమ్మాపురం, నాలుగోస్థానంలో గీతా మాధురి జట్టు నిలిచాయి. వీరికి వరుసగా రూ. 20వేలు, రూ. 15వేలు, రూ. 10వేలు, రూ. 5వేలు నగదు బహుమతులు అందించారు.

నేడు సర్వసభ్య సమావేశం

కొత్తపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మేరీ మంగళవానం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలో ఉన్న అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

26న ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని మునిసిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో ఈ నెల 26న ఉమ్మడి జిల్లాల బాల్ బ్యాడ్మింటన్, ఫెన్సింగ్, రోప్ స్కిప్పింగ్, షటిల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లాల కార్యదర్శులు వి. శివకుమార్, జీ. లక్ష్మయ్య మంగళవారం తెలిపారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ 2023-24 అండర్- 14, అండర్- 17 విభాగంలో జిల్లా స్థాయి ఎంపికలు ఉంటాయన్నారు.







నందికొట్కూరులో పల్లకీ మోస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, మహానందిలో శమీవృక్షం వద్ద పూజలు,ఓకారంలో వెండికవచం అందిస్తున్న దాతలు, వెలుగోడులో గ్రామోత్సవం నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు, వేల్పనూరులో సిద్ధిధాత్రి దేవి అలంకరణలో పల్లకోత్సవం

ఊరూరా దసరా ఉత్సవాలు

- ముగిసిన శరన్నవరాత్రి వేడుకలు
- అమ్మవార్లకు ప్రత్యేక పూజలు
- భక్తిశ్రద్ధలతో శమీ వృక్ష దర్శనం

మహానంది: మహానంది క్షేత్రంలో తొమ్మిదిరోజుల పాటు వైభవంగా జరిగిన దసరా నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు గంగిశెట్టి మల్లికార్జున, లక్ష్మీదేవి, ఉభయదాతల ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, పండిత బృందం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం శ్రీ కామేశ్వరీదేవి అమ్మవారిని సిద్ధిధాత్రి దుర్గ అలంకారంలో కొలువు చేసి పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి గజవాహనంపై గ్రామోత్సవం వైభవంగా జరిగింది. స్థానిక యాగశాలలో పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, ఘటప్రదక్షిణ పూజలు నిర్వహించి ఈశ్వర్‌నగర్‌లోని శమీవృక్షం వద్ద శమీపూజలు నిర్వహించారు.

ఓంకారంలో పూజలు..

బండిఆత్మకూరు మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన ఓంకారంలో తొమ్మిదిరోజుల పాటు దసరా నవరాత్రి ఉత్సవాలు కన్నులపండువగా జరిగాయి. ఈఓ నాగప్రసాద్ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందులో భాగంగా ఉత్సవాల ముగింపు సందర్భంగా పూర్ణాహుతి పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. దీంతో పాటు ఉత్సవాల సందర్భంగా సోమయాజులపల్లె గ్రామానికి చెందిన పోలిరెడ్డి కుమార్తె దాక్షాయని గణపతి విగ్రహానికి వెండికవచం అందించినట్లు ఈఓ తెలిపారు.బండిఆత్మకూరు మండలంలోని నవనందుల్లో ఒకటిగా ప్రసిద్ధి గాంచిన కడమలకాల్వలోని శివనంది క్షేత్రంలో కొలువైన శ్రీ పార్వతీ సమేత శ్రీ శివనందీశ్వరస్వామి వార్లకు గ్రామోత్సవం వైభవంగా జరిగింది. సాయంత్రం భక్తులు జమ్మిచెట్టు చుట్టూ ప్రదక్షిణ చేస్తూ పూజలు చేశారు.



మహానందిలో మహాపూర్ణాహుతి పూజలు చేస్తున్న దృశ్యం

అలరించిన దసరా వేషాలు

మహానంది పుణ్యక్షేత్రంలో సోమవారం రాత్రి దసరా వేషాలు అలరించాయి. మహానందికి చెందిన కళాకారులు, యువకులు పరమేశ్వరుడు, మహిషాసురమర్దిని, రాక్షసులు, పంచభూతాలు, తదితర కళారూపాలతో దసరా వైభవాన్ని ప్రదర్శించారు.

ముగిసిన నవరాత్రి ఉత్సవాలు

కొత్తపల్లి:దసరా నవరాత్రి ఉత్సవాల్లో తొమ్మిదవరోజు సోమవారంతో దేవి నవరాత్రులు ముగిశాయి. చివరిరోజు అమ్మవారు ఆలయంలో శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా సంగమేశ్వరంలోని ఉమామహేశ్వరాలయంలో లలితాదేవి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ దంపతులు అమ్మవారికి ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా గ్రామోత్సవం

ఆత్మకూరు: పట్టణంలో మంగళవారం శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అమ్మవారు శ్రీవాసవికన్యకాపరమేశ్వరి ఉత్సవమూర్తికి పూజలు నిర్వహించి ఊరేగింపు నిర్వహించారు. మేళతాళాల మధ్య రంగులు జల్లుకుంటూ ఆనందోత్సాహాల మధ్య ఊరేగింపు సాగింది. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కృష్ణమూర్తి , పువ్వాడ భాస్కర్ పాల్గొన్నారు. పట్టణంలోని శ్రీవాసవికన్యకపరమేశ్వరి దేవాలయంలో సోమవారం అమ్మవారు విజయలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

వెలుగోడులో లడ్డూ వేలం..

వెలుగోడు: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని సోమవారం విజయలక్ష్మీ రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ పురవీధుల వెంట అమ్మవారికి అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన లడ్డూ వేలంలో రూ.11,516లకు లాలం మనోహర్‌రెడ్డి దక్కించుకున్నారు. ఆర్యవైశ్య మహిళలు ప్రత్యేకంగా కోలాటం నిర్వహించారు. విజయదశమిని పురస్కరించుకొని పట్టణ శివారులోని శమీ వక్షం వద్దకు భక్తులు చేరుకొని ప్రదర్శనలు నిర్వహించారు. వేల్పనూరు గ్రామంలో అంకాల పరమేశ్వరి అమ్మవారు సిద్ధిదాత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంప్రాజెక్ట్‌లోకి శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మంగళవారం పూర్ణాహుతితో దసరా నవరాత్రులు ముగిశాయి. యాగశాలలో భక్తులు పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు.



మహానందిలో శేషవాహనంపై నిజరూపంలో శ్రీ గంగ, కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి

వైభవంగా దసరా వేడుకలు

నందికొట్కూరు: దసరా వేడుకలను సోమవారం భక్తులు వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని దుర్గామాతగా అలంకరించి శమీ వృక్షం వరకు ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కమిషనర్ కిషోర్ ఏర్పాట్లు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడ శమీ దర్శనం భక్తులు ఊరేగింపు నిర్వహించారు.

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు, జూపాడుబంగ్లా, పారుమంచాల, తర్తూరు, తంగడంచ, మండ్లెం, తరిగోపుల, తూడిచెర్ల, 80బన్నూరు, భాస్కరాపురం తదితర గ్రామాల్లో సాయంత్రం వేళల్లో శమీవృక్షానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అనంతరం స్వామివారి పల్లకీని పురవీధుల్లో భాజీభజంత్రీలతో ఊరేగించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తాటిపాడులోని శ్రీవీరభద్రస్వామి ఆలయం, జూపాడు బంగ్లా సుంకులాపరమేశ్వరీ ఆలయంలో కొలువుదీరిన అమ్మవార్లను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. గ్రామసమీపంలో ఉన్న కేసీ కాల్వలో విగ్రహాలను నిమజ్జనం చేశారు.




శ్రీరాజరాజేశ్వరి దేవిగా కొలనుభారతిదేవి సంగమేశ్వరంలో లలితాదేవి అమ్మవారు

పగిద్యాల: మండలంలోని నెహ్రూనగర్, పాత,కొత్త ముచ్చుమర్రి, సంకిరేణిపల్లె, బీరవోలు, ఆంజనేయనగర్, పగిద్యాల, కొత్త పాలమర్రి, లక్ష్మాపురం, తూర్పు, పడమర ప్రాతకోట, ఎం.ఎస్. ఘణపురం తదితర గ్రామాల్లోని ప్రజలు దసరా మహోత్సవ వేడుకలను కనులపండుగా నిర్వహించారు. అనాధిగా వస్తున్న సంప్రదాయాన్ని భావితరాలు కొనసాగిసూ శమీ వృక్ష సందర్శన చేసి భక్తితో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండల పరిధిలోని నెహ్రూనగర్ కమ్యూనిటీ భవనం ఎదుట ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహ నిమజ్జన వేడుకలను మంగళవారం భక్తులు ఘనంగా నిర్వహించారు.

నందికొట్కూరు రూరల్ : కొణిదేల గ్రామంలోని భ్రమరాంబా మల్లికార్జున స్వామి దేవస్థానంలో అమ్మవారు నిజరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. బిజినవేముల గ్రామంలో సర్పంచ్ రవి యాదవ్ పల్లకోత్సవంలో పాల్గొన్నారు.

మిడుతూరు: మండలకేంద్రమైన మిడుతూరులో పాటు అన్ని గ్రామాల్లో విజయదశమి పర్వదిన వేడుకలు వైభవంగా జరుపుకున్నారు. విజయదశమి పర్వదినం రోజున స్థానిక కన్యకాపరమేశ్వరీ ఆలయం, చౌడేశ్వరీ దేవీ ఆలయంలో అమ్మవార్లు సోమవారం రాజరాజేశ్వరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. చెన్నకేశవస్వామి ఆలయంలో సాయంత్రం శమీ వృక్షానికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో స్వామివార్లకు గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు.







పగిద్యాలలో శమీ వృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు, సున్నిపెంటలో పూజాద్రవ్యాలను హోమగుండానికి సమర్పిస్తున్న దృశ్యం, మిడుతూరులో రాజరాజేశ్వరీ దేవిగా, కొణిదేలలో భ్రమరాంబాదేవిగా,తాటిపాడులో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

పట్టణాభివృద్ధికి పెద్దపీట

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టణాభివృద్ధికి పెద్ద పీట వేశారని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఏబీఎం పాలెంలో రాష్ట్ర శాప్ చైర్మన్, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి కృషితో, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి సహకారంతో పార్కు నిర్మాణానికి రూ.40 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు సోమవారం మున్సిపల్ చైర్మన్ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి కావచ్చాయని చెప్పారు. పట్టణంలో రూ.16 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చిన్నరాజు, అబ్దుల్ హమీద్, చాంద్‌బాషా, రవూఫ్, అశోక్, నాయబ్, లాలు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్, ఉమ్మడి జిల్లా మైనార్టీ జోనల్ ఇన్‌చార్జ్ అబుబక్కర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



ఏబీఎం పాలెంలో పార్కుకు భూమి పూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

గ్రీన్ అంబాసిడర్లకు దుస్తుల పంపిణీ

జూపాడుబంగ్లా: దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని 80బన్నూరు గ్రామానికి చెందిన గ్రీన్ అంబాసిడర్లకు మంగళవారం గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ నాయకుడు ఎల్లారెడ్డి దుస్తులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ఇంటింటికి వెళ్లి చెత్తాచెదారాన్ని సేకరించి, గ్రామానికి దూరంగా తరలించి వీధులను పరిశుభ్రంగా ఉంచటంతో పాటు ప్రజలు రోగాలబారిన పడకుండా చేయటంలో గ్రీన్‌అంబాసిడర్ల పాత్ర కీలకమైందన్నారు. గ్రీన్ అంబాసిడర్లు తిరుపాలు, ప్రసాదు, స్వాములు తదితరులకు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాగిరెడ్డి, రమణారెడ్డి, అంజి, రాజేష్, శ్రీను, బాలు, సామేలు, రాజు పాల్గొన్నారు.



గ్రీన్ అంబాసిడర్లకు వస్త్రాలు అందజేస్తున్న దృశ్యం

బస్సుజాతాను విజయవంతం చేయండి

ఆత్మకూరు: కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరీ బస్సుజాతాను విజయవంతం చేయాలని ఆ పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రణధీర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని సుదర్శన వర్మ భవనంలో మంగళవారం ఆ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ నెల 31న జాతా ఆత్మకూరు పట్టణానికి చేరుకుంటుందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆ పార్టీ సభ్యులు సురేంద్ర, నాగేశ్వరరావు, ఇస్మాయిల్, సద్దామ్‌హుస్సేన్ పాల్గొన్నారు.

1 నుంచి 'జగనన్న ఎందుకు కావాలంటే'

జూపాడుబంగ్లా: నవంబర్ 1 తేదీ నుంచి రాష్ట్రానికి జగనన్న ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించనున్నట్లు జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి మంగళవారం తెలిపారు. నవంబర్ 1 నుంచి 14రోజుల పాటు మండలంలోని 11 గ్రామసచివాలయాల పరిధిలో కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

'వై ఏపీ నీడ్స్ జగన్'పై కార్యకర్తలకు దిశానిర్దేశం

శ్రీశైలంటెంపుల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమ నిర్వహణపై వైఎస్సార్‌సీపీ నాయకులకు, కార్యకర్తలకు శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి దిశా నిర్దేశం చేశారు. సోమవారం శ్రీశైలంలోని అతిథిగృహంలో పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమం ఎలా నిర్వహించాలి, ఈ కార్యక్రమంలో ప్రజలకు తెలియజేయాల్సిన విషయాలు, సంక్షేమ పథకాలు, తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎం.ఏ.రజాక్, శ్రీశైలం మండల ఇన్‌చార్జ్ భరత్‌రెడ్డి, టీఎండీ.రఫి, అసాది ప్రవీణ్‌దివ్యతేజ, కృష్ణమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

కార్మికుడి ప్రాణాలు కాపాడిన ఇంజెక్షన్



ప్రభుత్వ వైద్యశాలలో పారిశుద్ధ్య కార్మికునికి రూ.40 వేల ఇంజెక్షన్ వేస్తున్న వైద్యుడు

ఆత్మకూరు: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న విజయ్‌కు సోమవారం గుండెపోటు రావడంతో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, కో ఆప్షన్‌సభ్యులు ఎంఏ రషీద్‌లు హుటాహుటిన ప్రభుత్వ వైద్యశాలకు చేరారు. దగ్గరుండి అతడికి వైద్యం చేయించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని ప్రభుత్వ వైద్యశాలలో రూ.40 వేల ఇంజెక్షన్ అందుబాటులో ఉంచడంతో వైద్యాధికారి రాయుడు ఆ ఇంజెక్షన్ వేయించారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ మరింత మెరుగైన వైద్యం కోసం 108 వాహనం ద్వారా కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మున్సిపల్ కార్మికులకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఊరటనిస్తున్న మొక్కజొన్న

- మార్కెట్లో ఆశాజనకంగా ధరలు
- ప్రభుత్వ మద్దతు ధర క్వింటా రూ.2,090
- బహిరంగ మార్కెట్లో రూ.2,050
- వ్యాపారులు కుమ్మక్కై రేటు తగ్గించే యత్నం

జూపాడుబంగ్లా: ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవటంతో వర్షాధారం, కేసీ కాల్వ కింద సాగుచేసిన మొక్కజొన్న పంట దిగుబడులు కాస్త తగ్గినా ప్రస్తుతం ధర ఆశాజనకంగా ఉందని రైతులు పేర్కొంటున్నారు. అయితే కొందరు వ్యాపారులు కుమ్మక్కై ధర తగ్గించేందుకు యత్నిస్తుండటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధర తగ్గితే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

14,339 హెక్టార్లలో సాగు..

నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా, నందికొట్కూరు, మిడుతూరు, పాములపాడు, కొత్తపల్లి, పగిద్యాల మండలాల పరిధిలో మొక్కజొన్న సాదారణ సాగు విస్తీర్ణం 18,165 హెక్టార్లు ఉండగా ఈ ఏడాది 14,339 హెక్టార్లలో సాగుచేశారు. అలాగే ఆత్మకూరు, వెలుగోడు మండలాల పరిధిలో సాధారణ సాగు విస్తీర్ణం 2,562 హెక్టార్లు కాగా 1,805 హెక్టార్లలో మొక్కజొన్న పంటను సాగుచేశారు. బోర్లు, బావుల కింద సాగుచేసిన మొక్కజొన్న పంట ఎకరాకు 25 నుంచి 35 క్వింటాళ్ల దాకా దిగుబడి వచ్చినట్లు రైతులు పేర్కొంటున్నారు.

ఆశించిన స్థాయిలో మద్దతు ధర

ఖరీఫ్‌లో సాగుచేసిన మొక్కజొన్న పంట ఎకరాకు 25 నుంచి 35 క్వింటాళ్లు వచ్చాయి. ఎకరా మొక్కజొన్నల సాగుకు రూ.35వేల ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం క్వింటా మొక్కజొన్న ప్రభుత్వ మద్దతు ధర రూ.2,090 ఉండగా మార్కెట్ ధర రూ.2,050లు ఉండటం ఊరటనిస్తుందని పేర్కొంటున్నారు. పంట చేతికందే సమయానికి క్వింటాలు మొక్కజొన్నలు రూ.2,400లు ఉండగా స్థానిక వ్యాపారులు కుమ్మక్కై ధరను రోజు రోజుకు తగ్గిస్తుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కుమ్మక్కైన వ్యాపారులు

గ్రామాల్లోని వ్యాపారులు కుమ్మక్కై ధాన్యం కొనుగోలుకు ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులను రానివ్వకుండా రోజు రోజుకు గిట్టుబాటు ధరను తగ్గిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ధాన్యం చేతికందటానికి ముందు క్వింటా రూ.3వేలు పలికిన ధర పంట వచ్చాకా రూ.2,500లకు తగ్గించారంటున్నారు. ఇలా పంటనూర్పిళ్లు ముమ్మరంగా చేస్తున్న సమయంలో వ్యాపారులు కూడబలుక్కొని రోజు రోజుకు ధరలు తగ్గించి ప్రస్తుతం క్వింటాలు రూ.2,050లకు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఈ ధరకు కొనుగోలు చేసినా కొంత ఊరటలభిస్తుందని రైతులు పేర్కొంటున్నారు. ఇంతకంటే ధర మరింతగా తగ్గితే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి మద్దతు ధర ప్రకారం మొక్కజొన్నలు కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



మొక్కజొన్న ధాన్యాన్ని ఆరబెట్టిన రైతులు



ధాన్యాన్ని కాటావేస్తున్న హమాలీలు

మద్దతు ధర కంటే తగ్గితే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు



ప్రభుత్వం మొక్కజొన్నలకు క్వింటాలుకు రూ.2,090ల మద్దతు ధరను ప్రకటించింది. ప్రభుత్వ మద్దతు ధరకంటే తక్కువగా వ్యాపారులు తగ్గిస్తే విషయాన్ని జిల్లా అధికారులు, మార్క్‌ఫెడ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతుభరోసా కేంద్రాల పరిధిలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి ధాన్యం కొనుగోలు చేస్తాం. ప్రస్తుతం ప్రభుత్వ మద్దతు ధరకంటే బహిరంగ మార్కెట్లో ధర అధికంగా ఉన్నందున కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసే అవకాశాల్లేవు.

– కృష్ణారెడ్డి, ఏఓ, జూపాడుబంగ్లా

ధరలు కొంత మేలు



ఖరీఫ్ సీజన్‌కుగాను నేను 9ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగుచేశా. ఎకరాకు రూ.35వేలు ఖర్చు వచ్చింది. దిగుబడి ఎకరాకు 30క్వింటాలు వచ్చింది. మొన్నటి వరకు క్వింటాలు ధర రూ.2,200లు ఉండగా వ్యాపారులు రేట్లు తగ్గించి ప్రస్తుతం క్వింటాలు రూ.2,050లకు అడుగుతున్నారు. వ్యాపారులు కుమ్మక్కై రోజు రోజుకు ధరను తగ్గిస్తున్నారు. ఇంతకంటే ధర తగ్గిందంటే నష్టాన్ని చవిచూడాల్సి ఉంటుంది.

– మధు, రైతు, జూపాడుబంగ్లా

దిగుబడి తగ్గింది



నేను 37ఎకరాలు కౌలుకు తీసుకొని కేసీ కాల్వ కింద మొక్కజొన్న పంటను సాగుచేశాను. పంట సాగుచేసిన మొదట్లో వర్షాలు బాగా కురిసాయి. తర్వాత వర్షాలు పడకపోవటం, సకాలంలో కేసీ కాల్వకు సాగునీరు రాకపోవటంతో సాగుచేసిన పంట ఎదుగుదలలోపించి పంట దిగుబడి తగ్గింది. పెట్టుబడి ఎకరాకు రూ.30వేలు రాగా ఎకరాకు 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది.

– రాజేష్, కౌలురైతు, వనములపాడు

మహానందిలో భక్తజన సందడి



మహానందీశ్వరుడి దర్శనార్థం వేచి ఉన్న భక్తులు

మహానంది: మహానంది ఆలయంలో మంగళవారం భక్తులసందడి నెలకొంది. దసరా సెలవులు కావడంతో రెండు తెలుగురాష్ట్రాలతో పాటు తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. భక్తులరాకతో ఆలయ ప్రాంగణాలు కళకళలాడాయి. ఆలయానికి చేరుకున్న భక్తులు రుద్రగుండం, చిన్నకోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. ఉదయం నుంచి ప్రారంభమైన స్వామి,అమ్మవారి దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది. ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.